గ్రూప్‌-1 ర్యాంకర్‌ను సన్మానించిన ఎమ్మెల్యే



దీపికారత్నను సన్మానించిన ఎమ్మెల్యే గాంధీ

చందానగర్ : గ్రూప్‌–1 ర్యాంకర్ కోలపల్లి దీపికరత్నను మంగళవారం ఎమ్మెల్యే గాంధీ అభినందించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్ –1 పరీక్షల్లో మాదాపూర్ డివిజన్ పరిధి గోకుల్‌ప్లాట్స్‌కు చెందిన కోలపల్లి దీపికరత్న 470 మార్కులతో.. మల్టీజోన్‌లో 123వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్ 1 అత్యున్నత స్థాయి ఉద్యోగమని, నేటి యువతకు ఆమె స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. యువత ఉన్నత లక్ష్యాల వైపుగా అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో కోలపల్లి ప్రసాద్, మంత్రిప్రగడ సత్యనారాయణ, గోలి శ్రీనివాస్, కొండల్‌రావు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

బ్రేక్ డౌన్.. ట్రాఫిక్ జాం



గచ్చిబౌలి: సైబర్ టవర్ ఫ్లైఓవర్‌పై కారు బ్రేక్ డౌన్ కావడంతో ఎన్‌బిఏ వైపు నుంచి వచ్చే వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కల్గింది. ట్రాఫిక్ జాం నెలకొనడంతో మాదాపూర్ ట్రాఫిక్ పోలీసులు కారును తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో దాదాపు గంట పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఐటీ కారిడార్‌లో నిత్యం ఏదో ఒక చోట వాహనం బ్రేక్ డౌన్ కావడం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వాహనాల రద్దీ నడుమ ట్రాఫిక్ పోలీసులు అక్కడకు వెళ్లి వాహనాన్ని తరలించడం పెద్ద సవాల్‌గా మారుతోంది.

గణేష్ గడ్డ కిటకిట...

పటాన్‌చెరు టౌన్: గణేష్ గడ్డ దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది.మంగళవారం పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలోని గణేష్‌గడ్డ దేవస్థానంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సంతోష్ జోషి, చంద్రశేఖర్ స్వామి, జగదీష్ స్వామి మాట్లాడుతూ... సంకష్టహర చతుర్థి సందర్భంగా స్వామివారికి ఉదయం పంచామృతాభిషేకం ,హోమం చేసినట్లు తెలిపారు.

మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ రెడీ

60 స్ట్రాటజిక్ లేబర్ టీమ్‌లు
- 15 మొబైల్ మాన్‌సూన్ టీమ్‌లు
- 20 వాహనాలు రెడీ
- వరద నీటిని తొలగించేందుకు తక్షణ చర్యలు



భారీ వర్షానికి కొత్తగూడలో రోడ్డుపై వరద నీరు (ఫైల్)

గచ్చిబౌలి: వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ అధికారులు మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ రెడీ చేశారు. రాత్రి సమయంలో విధులు నిర్వహించేందుకు అధికారులకు బాధ్యతలు అప్పగించనుంది. అత్యవసర సమయంలో వర్షం వల్ల ఏర్పడే ఇబ్బందులను తొలగించేందుకు మొబైల్ టీమ్‌లను సిద్ధం చేయనున్నారు. వర్షం వస్తే రోడ్లపై వరద నీటితో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కల్గుతోంది. వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద భారీగా వరద నీరు చేరడంతో కొన్ని చోట్ల వాహనాలు ముందుకు పోలేని పరిస్థితి ఉంటుంది. దీనికితోడు గాలి వానకు చెట్లతో పాటు హోర్డింగ్‌లు కూలితే ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఉంటాయి. మాన్‌సూన్ ఎమర్జెన్సీలో భాగంగా వెస్ట్ జోనల్‌లో 15 మొబైల్ టీమ్‌లు పని చేయనున్నాయి. యూసూఫ్‌గూడ సర్కిల్‌లో 3, శేరిలింగంపల్లి సర్కిల్‌లో 4, చందానగర్ సర్కిల్ 4, ఆర్సీపురం పటాన్‌చెరు సర్కిల్ 4 మొబైల్ టీమ్‌లు పని చేస్తాయని వెస్ట్ జోనల్ ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. వెస్ట్ జోన్‌లోని నాలుగు సర్కిళ్లలోని వాటర్ స్టాగినేషన్ పాయింట్ల వద్ద స్ట్రాటజిక్ టీమ్‌లు పని చేస్తాయి. నాలుగు సర్కిళ్లలో 60 స్ట్రాటజిక్ లేబర్ టీమ్‌లు పని చేస్తాయి. టీమ్‌లు ఆయా సర్కిళ్ల ఈఈల పర్యవేక్షణలో కొనసాగుతాయి.

నోడల్ ఆఫీసర్లు వీరే

శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో... మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రాత్రి సమయంలో విధులు నిర్వహించేందుకు టీమ్ లీడర్లు, నోడల్ ఆఫీసర్లను నియమించారు. సోమవారం.. ఏఈలు జగదీశ్వర్, నోడల్ ఆఫీసర్ డీఈ ఆనంద్, మంగళవారం.. ఎం.డి. ఖాదర్, నోడల్ డీఈ విశాలాక్షి, బుధవారం.. అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ తనూజ, నోడల్ ఆఫీసర్ టీపీఎస్ జిషన్, గురువారం.. న్యాక్ ఇంజనీర్ మధుకర్, నోడల్ ఆఫీసర్ ఏఈ భాస్కర్, శుక్రవారం.. ఏఈ లిఖిత, నోడల్ ఆఫీసర్ రఘుపతి, శనివారం.. టీపీబీఓ సంతోష్ కుమార్, ఏసీపీ వెంకటరమణ, ఆదివారం.. ఎస్‌ఎఫ్‌ఏ వెంకటేశం, నోడల్ ఆఫీసర్ ఎఎంఓహెచ్ శ్రీకాంత్ రెడ్డిలు విధులు నిర్వహిస్తారు.



శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కార్యాలయం ఎదురుగా లింక్ రోడ్డు పరిస్థితి



కొత్తగూడలో...

వాటర్ లాగింగ్ పాయింట్లు ఇవే

శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ పరిధిలోని ఆయా సర్కిళ్లలో భారీ వర్షం కురిస్తే వాటర్ స్టాగినేషన్ పాయింట్ల వద్ద భారీగా వరద చేరే అవకాశం ఉంది. గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్ ముందు, డీఎల్ఎఫ్, బయోడైవర్సిటీ జంక్షన్, అంజయ్యనగర్, ఖాజాగూడ, రాయదుర్గం లిడ్‌క్యాప్ సమీపంలో, డీఎల్ఎఫ్, జయభేరీ, ట్రిపుల్ ఐటీ, జోనల్ కార్యాలయం ఎదురుగా లింక్ రోడ్డు మాదాపూర్ ఫేజ్‌–2, నెక్టార్ గార్డెన్, మాదాపూర్ మెయిన్ రోడ్డు, శిల్పారామం, కొత్తగూడ జంక్షన్, కొండాపూర్ ఆర్టీఓ ఆఫీస్ ఎదురుగా, లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి, పాపిరెడ్డినగర్ కాలనీ రైల్వే అండర్ బ్రిడ్జి, దీప్తిశ్రీనగర్, మదీనాగూడ, మియాపూర్ సమీపంలోని జూబ్లీ హిల్స్ లింకురోడ్డు తదితర చోట్ల వరద నీరు చేరుతున్నట్లు జీహెచ్‌ఎంసీ అధికారులు గుర్తించారు.

24 గంటలు ..కంట్రోల్ రూమ్‌లు

వర్షాకాలం చెట్లు పడిపోవడం, నాలాలు పొంగడం, కాలనీలు, అపార్ట్‌మెంట్లలోకి వరద నీరు చేరితే కంట్రోల్ రూమ్‌లకు సమాచారం అందించాలి. ఆయా సర్కిళ్లకు త్వరలో కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు కేటాయించనున్నారు. 24 గంటలు కంట్రోల్ రూమ్ పని చేస్తుంది.

చందానగర్ సర్కిల్ పరిధిలో..

డీఈ ప్రవీణ్‌కుమార్, నోడల్ ఆఫీసర్ ఏఈ ప్రశాంత్, న్యాక్ ఇంజనీర్ శివ ప్రశాంత్, నోడల్ ఆఫీసర్ ఏఈ ప్రతాప్, న్యాక్ ఇంజనీర్ అభినవ్, నోడల్ ఆఫీసర్ డీఈ దుర్గాప్రసాద్, న్యాక్ ఇంజనీర్ తౌషిక్, నోడల్ ఆఫీసర్ ఈఈ శ్రీదేవి, చైన్‌మెన్ రాజేందర్ లాల్, నోడల్ ఆఫీసర్ ఏఈఈ సంతోష్‌కుమార్ రెడ్డి, ఏఈ చిన్న నోడల్ ఆఫీసర్ మన్నెం నాయక్, చైన్‌మెన్ జావెద్ నోడల్ ఆఫీసర్ ఏఈఈ ఒ.సంతోష్‌లను నియమించారు.

టెండర్లకు బ్రేక్

మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ప్రతి యేటా అత్యవసర పనులు చేపట్టేందుకు జోనల్‌స్థాయిలోనే టెండర్ల ప్రక్రియ జరుగుతుంది. రూ.9 కోట్ల టెండర్లపై ఇప్పటికీ స్పష్టత రాలేదు. వర్షా కాలంలో విపత్తుల నిర్వహణను హైడ్రా నిర్వహించే అవకాశం ఉండటంతో దీన్ని హోల్డ్‌లో పెట్టామని , స్పష్టత రావాల్సి ఉందని శేరిలింగంపల్లి ఎస్‌సీ శంకర్ తెలిపారు. ఈ వర్షాకాలానికి హెచ్‌ఎంసీ అధికారులు మాన్‌సూన్ ప్లాన్‌తో సిద్ధమయ్యారు.

ప్రత్యామ్నాయం అవసరం

- గచ్చిబౌలి జంక్షన్ నుంచి కొండాపూర్ వైపు ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డును మూసి వేయడంతో వర్షం వస్తే ఇందిరానగర్, డీఎల్ఎఫ్, అంజయ్యనగర్‌లో ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశం ఉంది. ప్రత్యామ్నాయం చూడాలి.
- కొండాపూర్ ఆర్టీఓ కార్యాలయం ఎదురుగా భారీ ఎత్తున వరద నీరు చేరుతుంది. వరదను నాలాలోకి మళ్లించే చర్యలు తీసుకోవాలి.
- వర్షం వచ్చే సమాచారాన్ని ముందే ఐటీ కారిడార్‌లో తెలియజేయడం.. ఇతర మార్గాల్లో వెళ్లే విధంగా చర్యలు ట్రాఫిక్ అధికారులు చర్యలు తీసుకోవాలి.
- వరద ఉన్న రహదారుల వైపు వాహనాలు రాకుండా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యామ్నాయ రోడ్లలోకి ట్రాఫిక్‌ను మళ్లించాలి.

దేశాభివృద్ధి బీజేపీతోనే..



పార్టీ జెండాను ఎగురవేసిన నాయకులు

చందానగర్ : దేశం మరింత అభివృద్ధి చెందాలంటే బీజేపీతోనే సాధ్యమని డివిజన్ అధ్యక్షులు కైతాపురం జితేందర్ పేర్కొన్నారు. హఫీజ్‌పేట డివిజన్ పరిధిలోని హుడా కాలనీలో డివిజన్ అధ్యక్షులు జితేందర్ అధ్యక్షతన మంగళవారం బీజేపీ కార్యశాల (వర్క్‌షాప్) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా పార్టీ సూచన మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 11 ఏళ్ళ సుపరిపాలన, యోగా దినోత్సవం, డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్, ప్రపంచ పర్యావరణ దినోత్సవం, ఎమర్జెన్సీ డే, మన్‌కీ బాత్ తదితర విషయాలపై ముందస్తు కార్యాచరణ చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ 11 సంవత్సరాలలో ప్రధాని చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర మహిళా నాయకురాలు వినయ, జిల్లా అధికార ప్రతినిధి అజిత్ సేనాపతి, మాజీ కౌన్సిలర్ రమణయ్య, జిల్లా గీత సెల్ కన్వీనర్ రవి గౌడ్, సీనియర్ నాయకులు దేవానంద్ యాదవ్, సత్యనారాయణ రాజు, పవన్, డివిజన్ ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, ప్రసాద్ పాత్రో పాల్గొన్నారు.

తల్లీ, కూతురు అదృశ్యం

మియాపూర్ : తల్లీ కూతురు అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్ముల పోచయ్య భార్య భవాని , కూతురు వర్షిత(4)తో మియాపూర్ బాలాజీనగర్‌లో ఉంటున్నారు. స్థానికంగా కూలీ పనులు చేసుకుంటున్నారు.ఈ నెల 5వ తేదీ ఉదయం 8 గంటలకు పోచయ్య రోజులానే పనికి వెళ్లగా భార్య,కూతురు ఇంట్లోనే ఉన్నారు. తిరిగి పోచయ్య రాత్రి 9.30 గంటలకు ఇంటికి రాగా చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. ఆందోళన చెందిన పోచయ్య మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం నిర్వహించిన డ్రైవ్‌లో 12 మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఏడుగురికి రూ. వెయ్యి, మరో ఐదుగురికి రూ.1500 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌కు మూతలు ఏర్పాటు

అల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోళ్లకు కొత్త మూతలు ఏర్పాటు చేశారు. మూ తలు లేకుండా శిథిలావస్థకు చేరుకున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌తో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని ఈ నెల 9వ తేదీ 'సాక్షి'లో ప్రచురితమైన 'పొంచి వున్న ప్రమాదం' అనే శీర్షికకు అధికారులు స్పందించి మూతలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 'సాక్షి'కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్ (గతంలో)



మ్యాన్‌హోల్‌కు ఏర్పాటు చేసిన మూత

సాక్షి ఎఫెక్ట్

పైప్‌లైన్ లీకేజీ సమస్య పరిష్కారం



మియాపూర్ : మియాపూర్ మదీనాగూడలో జాతీయ రహదారి నుండి ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ రోడ్డులో మూలమలుపు వద్ద తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు చేశారు అధికారులు. 'లీకేజీ.. రోడ్డుపై భారీ గుంత' అనే శీర్షికన సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి జలమండలి అధికారులు స్పందించి పైపులైన్ మరమ్మతులతో బాటు గుంతను పూడ్చేశారు.

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను కలిసిన లైట్‌హౌజ్ ప్రతినిధులు

చందానగర్: హైదరాబాద్ నగర వ్యాప్తంగా లైట్‌హౌస్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల విస్తరణపై మంగళవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌ని లైట్ హౌస్ కమ్యూనిటీస్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ గణేష్ నటరాజన్, రాష్ట్ర అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్‌లు కలిసి చర్చించారు. ఈ సందర్భంగా నగర యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేలా నైపుణ్యాభివృద్ధి, జీవనోపాధి, కెరీర్ రెడినెస్ ప్రోగ్రామ్‌లను విస్తృతంగా అందించే దిశగా యత్నిస్తున్నామన్నారు.